క్లుప్తంగా

ఏవో నారాయణరావుకు అభినందనలు



నారాయణరావును అభినందిస్తున్న జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు

మహారాణిపేట: ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి(ఘోషా) పరిపాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును గురువారం పలువురు అభినందించారు. జిల్లా ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, ఎన్‌జీవో సంఘం సిటీ అధ్యక్షుడు వీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు నారాయణరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వామి వివేకానంద సభ్యురాలికి ఘన సత్కారం



ఉమాదేవిని సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: నవరత్నాల్లో భాగంగా యాక్మీ సంస్థ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యురాలు ఉమాదేవిని గురువారం ఘనంగా సత్కరించింది. మహిళా దినోత్సవం పురస్కరించుకొని నగరంలోని యాక్మీ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ సంస్థ సేవలో భాగస్వామ్యం అయినందుకు గర్వంగా ఉందన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

సీతమ్మధార : లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణకు, మహిళా హక్కుల రక్షణకు మనువాద రాజకీయాలను ఎదుర్కొనేందుకు మహిళలు నడుంబిగించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఏపీ మహిళా సమాఖ్య విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, ప్రధాన కార్యదర్శి ఎం.పి.బేగం, దేవుడమ్మ, అన్నపూర్ణ, గాయత్రి ,అరుణ, కోశాధికారి జి.జయ, బి.పుష్పలత, మస్తాన్ బీబీ, పద్మ పాల్గొన్నారు.

అన్ని పార్టీలు మద్యనిషేధాన్ని మ్యానిఫెస్టోలో చేర్చాలి

అల్లిపురం: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో మద్య నిషేధం అంశాన్ని చేర్చా లని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య జెండాను ఆమె ఎగురవేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేగం, జిల్లా ఉపాధ్యక్షురాలు దేవుడమ్మ, అన్నపూర్ణ, సహాయ కార్యదర్శులు గాయత్రి, అరుణ, కోశాధికారి జి.జయ, నాయకులు, బి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు చందన అభిషేకం



గంధంతో అభిషేకం చేస్తున్న ఈవో

సీతమ్మధార : శివరాత్రి సందర్భంగా దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి గురువారం సాయంత్రం గంధంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారిణి జి.వి.రమాబాయి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఘనంగా దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం



దుర్గాలమ్మ అమ్మవారు



నృత్యం చేస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం తొలేళ్ల ఉత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. దుర్గాలమ్మకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. సాయంత్రం దుర్గాలమ్మ ప్రాంతం, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, పండా వీధి, కల్లుపాకలు, పెరికి వీధి తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అష్టలక్ష్ములు, పులివేషాలు, తప్పెటగుళ్లు, తీన్‌మార్ డప్పులతో పరిసర ప్రాంతమంతా కోలాహలంగా మారింది. విద్యుత్ దీపాలతో ఆయా ప్రాంతాలు సందడిగా నెలకొన్నాయి. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఆలయ ప్రాంగణంలో రాక్షసుడ్ని వధిస్తున్న దుర్గమ్మ వేషధారి

నేడు మహాశివరాత్రి ఉత్సవం

మహాశివరాత్రి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటల నుంచి కుంకుమార్చనలు, దర్శనాలు, శూలాల పండగ, భక్తులు అగ్నిగుండం తొక్కడం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. శనివారం అమ్మవారి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 16న మారువారం పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) జరపనున్నారు. 17 మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

నీలమ్మవేపచెట్టు అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లో వెలిసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి తొలేళ్ల ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులుఅగ్ని గుండం ప్రవేశం చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్‌పర్సన్ బోరా విజయలక్ష్మి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం ప్రధాన ఉత్సవం నిర్వహించనున్నట్టు ఈవో రమాబాయి చెప్పారు.



తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

అమ్మవారి ఉత్సవ విగ్రహం అందజేత

సీతమ్మధార :దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారికి భక్తురాలు ఆర్.సంగీత రూ.2.17 లక్షలు విరాళం అందజేశారు. ఉత్సవ విగ్రహంతోపాటు పెయింటింగ్ పనులకు ఈ నిధులు వెచ్చించాలని ఆమె ఈవో రమాభాయికి విజ్ఞప్తి చేశారు. దొండపర్తికి చెందిన సంగీత అమ్మవారి భక్తురాలు. ఇప్పటి వరకు అమ్మవారికి ఉత్సహ విగ్రహం లేకపోవడంతో రూ.1.17లక్షలతో విగ్రహం తయారు చేయించి అందజేశారు. మరో రూ.లక్షతో ఆలయానికి పెయింటింగ్ వేయించాలని కోరారు. ఈ సందర్భంగా సంగీతకు ఈవో, చైర్మన్ సర్వేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం, పైడా విద్యా సంస్థల అధినేత కృష్ణప్రసాద్



బహుమతులు అందజేస్తున్న జిల్లా సివిల్ జడ్జి శేషమ్మ, చిత్రంలో డీసీపీ వెంకటరత్నం

డాబాగార్డెన్స్: ఐదుగురు దేవతామూర్తుల శక్తి మహిళల్లో దాగి ఉందని క్రైమ్ డీసీపీ వెంకటరత్నం పేర్కొన్నారు. దాగి ఉన్న శక్తిని వెలికి తీసి ఉన్నత శిఖరాలకు మహిళలు చేరుకోవాలని ఆమె సూచించారు. సౌత్ జైల్‌రోడ్డు రెడ్నంగార్డెన్స్‌లోని పైడా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, లా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, మిసెస్ ఆంధ్ర 2024 విజేత శిరీషతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డీసీపీ వెంకటరత్నం మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో మహిళ పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రేమ, ఆత్మధైర్యం, కుటుంబ నిర్వహణ, ఉన్నత విద్య, అనురాగం అందించడంలో పార్వతిదేవి, శక్తి, కాళి, దుర్గ, సరస్వతి కలిగి ఉంటారన్నారు. విద్యార్థినులు వారిలో దాగి ఉన్న ఈ గుణాలు వెలికి తీసి అభివృద్ధి బాట పట్టాలని పిలుపునిచ్చారు. పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో తమ కళాశాలలో 80 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తే 78 మంది పురుషులు కాగా, కేవలం ఇద్దరు మహిళలే ఉండేవారన్నారు. ఆ సమయంలో మహిళలు ఇళ్లకే పరిమితమైపోయేవారని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో దిగ్గజ కంపెనీలు సైతం సీఈవోలుగా మహిళలు ఉన్నారని తెలిపారు. ప్రొఫెసర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ స్త్రీ జన్మ ఎంతో గొప్పదన్నారు. ఉన్నత శిఖరాలకు విద్యార్థులు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సరోజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిసెస్ ఆంధ్ర 2024 విజేత శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

మహారాణిపేట: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. గురువారం కేజీహెచ్ నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ఎస్పీఎం హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శేషమ్మ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలకు పూర్తిస్థాయిలో వసతులు, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలపైనే ఉందన్నారు. క్రైం డీసీపీ వెంకటరత్నం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి బుచ్చిరాజు, సూపర్డెంట్ డాక్టర్ అశోక్ కుమార్,ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత, డిప్యూటీ సూపరింటింటెంట్ డాక్టర్ వాణి, డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ డి. లక్ష్మీతులసీ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరిండింటెంట్లు కల్పనా మోలీ.రమణమ్మ, కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సత్య వల్లీ, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ ఈశ్వరమ్మ,నర్సింగ్ యూనియన్ నాయకురాళ్లు డి.లక్ష్మి, పిట్టా వరలక్ష్మి, మణికిరణకుమారి, గౌరీ, శారద, టి.గంగాభవానీ, జివి వరలక్ష్మి, పి.లక్ష్మి, రాధా బెహరా. గ్రేసి, ప్రియాంక, స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ అవగాహన

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో మహిళా సిబ్బందికి క్యాన్సర్‌పై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. వారం రోజులుగా వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు రేడియేషన్ అంకాలజి విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి కేజీహెచ్ సూపరింటిండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ లక్ష్మీతులసీ, డిప్యూటీ సూపరింటిండెంట్ డాక్టర్ ఐ.వాణి, గైనాకాలజీ ప్రొఫెసర్ సంధ్యా, డాక్టర్ సామిని, డాక్టర్ శైలజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరం పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ సాయింత్‌వర్మ



ఇసుక కొండ రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సూచనలు ఇస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

జగదాంబ: మహా విశాఖ నగరపాలక సంస్థ నాల్గో జోన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతినే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సాయింత్‌వర్మ అన్నారు. గురువారం ఆయన జగదాంబ వద్ద సెమిటరీ, క్లాక్ టవర్, పూర్ణామార్కెట్ నుంచి ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం రోడ్డు అభివృద్ధి పనులు, జగదాంబ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు జరుగుతున్న రహదారి విస్తరణ, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. జగదాంబ వద్ద జరుగుతున్న రెజిమెంటల్ లైన్స్ సెమిటరీ క్లాక్‌టవర్ పరిశీలించి సెమిటరీ లోపల పూర్తిగా పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. సెమిటరీ చుట్టూ ఉన్న కాంపౌండ్ వాల్‌ను మరమ్మతులు చేయాలన్నారు. అలాగే పూర్ణామార్కెట్ నుంచి ఇసుక కొండసత్యనారాయణ స్వామి దేవాలయం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు పరిశీలించారు. ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వరకు జరుగుతున్న రహదారి, కాలువల నిర్మాణాలను పరిశీలించారు. రహదారి విస్తరణతో పాటు కాలువలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణాలు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూపరింటెండెంట్ ఇంజిరింగ్ అధికారి సత్యనారాయణరాజు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇందిరాప్రియద్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం స్టేడియంలో ఉన్న డెబ్రిస్, ఉపయోగంలోని వాహనాలు వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావును ఆదేశించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారిణి సంతోష్‌కుమారి, ఏసీపీ ఝూన్సీలక్ష్మి, ఏఎంహెచ్‌వో రాజేష్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

భద్రతాదళాల మార్చ్‌పాస్ట్



టూటౌన్ సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో మార్చ్‌పాస్ట్ చేస్తున్న భద్రతాదళాలు

అల్లిపురం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం నగరంలో టూటౌన్ పరిధిలో ప్రత్యేక రక్షక దళాలు మార్చ్‌పాస్ట్ నిర్వహించాయి. నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ బెండు తిరుమలరావు ఆధ్వర్యంలో భద్రతా దళాలు గోకుల్ థియేటర్, చావులమదుం, నేరెళ్లకోనేరు, అల్లిపురం మెయిన్‌రోడ్డు, బంగారుమెట్ట, నీలమ్మవేపచెట్టు రోడ్డు, సౌత్ జెయిల్‌రోడ్డు, డాబాగార్డెన్స్, సరస్వతి పార్కు ప్రాంతాల్లో భద్రతా దళాలు మార్చ్‌పాస్ట్ చేపట్టాయి. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

తీరప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

జగదాంబ: మహా శివరాత్రి సందర్భంగా సముద్ర తీరప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్టు జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జోన్-4 పరిధిలో 16 శివాలయలు ఉన్నాయన్నారు. ఇందులో ముఖ్యంగా బీచ్‌రోడ్డులో నేవల్ కోస్టల్ బ్యాటరీ నుంచి ఎన్‌టీఆర్ విగ్రహం వరకు సముద్రం స్నానాలు చేసే భక్తులకు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో కోస్టల్ బ్యాటరీ వద్ద 30 మంది గజఈతగాళ్లను, 10 ప్రత్యేక బోట్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద బీచ్‌లో 50 మంది గజ ఈతగాళ్లు, 14 ప్రత్యేక బోట్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే సాగరతీరాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేసేందుకు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సచివాలయ సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షణలో వీరందరూ శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు విధులు నిర్వహిస్తారన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 88వ త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలు

డాబాగార్డెన్స్: నవనిర్మాణం చేసే శక్తి ఆధ్యాత్మికతకు మాత్రమే ఉందని, అటువంటి మంచి సమాజం కోసం కృషి చేస్తున్న ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అభినందనీయమైన సంస్థ అని జీవీఎంసీ జాయింట్ డైరెక్టర్, అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరి శ్రీనివాస్, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కొనియాడారు. హెచ్‌బీ కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో త్రిమూర్తి శివ జయంతిని నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ బ్రహ్మకుమారి రమా చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి ఎంతో దోహదపడతున్నాయన్నారు.

మత రాజకీయాలను ఓడించాలి



మాట్లాడుతున్న పద్మ

సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో మత రాజకీయాలను ఓడించాలని,బీజేపీ ఎన్‌ఆర్‌సీ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ, న్యాయవాది జహరా పిలుపునిచ్చారు. ఈ మేరకు మహిళా చేతన ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ పురుష సమానత్వం కోసం, స్త్రీలపై హింసను వ్యతిరేకిస్తూ ఉద్యమించడమే అంతర్జాతీయ మహిళాదినం ప్రాముఖ్యత అని అన్నారు. రానున్న ఎన్నికల్లో 33 శాతం మహిళ రిజర్వేషన్ ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జమాతే ఇస్లాం మహిళా విభాగం ప్రతినిధి జుఫ్రున్నీసా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌సీ ప్రతిపాదనలను తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

దీక్షాపరుల బస్సు యాత్ర



యాత్రలో దీక్షాపరులతో కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ అర్బన్ జిల్లా క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో గురువారం ఏలూరు దుగ్గిరాల వద్ద ఉన్న హోలీ లాండ్ (పవిత్ర భూమి)కి దీక్షాపరుల యాత్రను ప్రారంభించారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ ప్రాంగణంలో బస్సు యాత్రను ప్రారంభించారు. కథోలిక విశ్వాసంలో తపస్సు కాలంలో దీక్ష చేపట్టిన జ్ఞానాపురం, చలువతోటకు చెందిన దీక్షాపరులను రెండు బస్సుల్లో సుమారు 100మందిని సొంత నిధులతో పుణ్యక్షేత్రాలకు తీసుకొని వెళ్లారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సభ్యులకు సత్కారం



ఆలయ కమిటీని సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరమెట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను వేంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయం కార్యవర్గ సభ్యులు సత్కరించారు. గ్రంథాలయ కార్యాలయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొడ్డేటి కిషోర్, సభ్యులు పాల్తేటి ఊర్వశి, కొల్ల సత్యవతి, కొణతాల కృష్ణవేణి, మానస, తాడి అనురాధలను ఘనంగా సత్కరించారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎయిర్‌పోర్టులో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలుకుతున్న నగర పోలీసు కమిషనర్ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ.

పారదర్శకంగా ఎన్నికల విధులు

మహారాణిపేట: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టరు కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ అధ్యక్షతన విశాఖ తూర్పు శాసనసభ నియోజకవర్గం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు స్పందన
- బంగారమ్మమెట్ట సచివాలయ పరిధిలో 465 మందికి వైద్య పరీక్షలు

అల్లిపురం: ప్రజల ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన ఏర్పడింది. బంగారమ్మ మెట్ట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు జారీ చేసిన వారు కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్నారు. సుమారు 465 మందిని వైద్యులు పరీక్షించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కొందర్ని కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై అవగాహనకల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం నిమిత్తం ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొని తమ సహకారాన్ని అందజేశారు.



బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

కంటి సమస్యతో వచ్చాను



మాది బంగారమ్మమెట్ట. కంటి సమస్యతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చాను. డాక్టర్లు తనిఖీ చేశారు. అవసరమైన సూచనలు చేశారు. మందులూ ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో చక్కగా పరీక్షలు చేస్తున్నారు.

– పి.అప్పలనరసమ్మ

మెరుగైన వైద్యం



నేను షుగర్, బీపీతో బాధపడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించారు.

– ఎ.భవాని, బంగారమ్మమెట్ట

చక్కగా పరీక్షించారు



శిబిరంలో వైద్యులు చక్కగా పరీక్షలు చేశారు. షుగర్‌తో బాధపడుతున్నాను, నీరసంతో వచ్చాను. వైద్యులు అవసరమైన సూచనలు, సలహాలు అందజేశారు. మందులూ అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మంచి కార్యక్రమం చేపట్టారు.

– జి.జనార్దన్